క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కేసరపల్లి(గన్నవరం): కేసరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వహణ ఇంజినీర్ పి.హరిబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేసరపల్లి, అప్పారావుపేట, అజ్జంపూడి, బుద్ధవరం, బూతిమిల్లిపాడు, జక్కులనెక్కలం శివారులోని జగనన్న కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు సేవలు



కంకిపాడు: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్ అన్నారు. ఉప్పలూరు పీహెచ్‌సీ పరిధిలోని ఈడుపుగల్లు ఆరోగ్య ఉపకేంద్రంలో మంగళవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. 79 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి. రాజేష్ కుమార్ కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఝాన్సీ, ఏఎన్‌ఎం అనిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే సమర్థంగా పూర్తి చేయాలి

కంకిపాడు: ఇంటింటి సర్వే సమర్థంగా పూర్తి చేయాలని ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు సూచించారు. పునాదిపాడు సచివాలయంలో మంగళవారం వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. క్లస్టర్ల వారీగా ఇంటింటి సర్వే తీరు, ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై సమీక్షించారు. సర్వేను పూర్తి చేసి జగనన్న సురక్షలో ధ్రువీకరణ పత్రాలు అందించడానికి సమాయత్తం కావాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దని హితవు పలికారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ బి.వెంకటేశ్వరరావు, ముసిబోయిన మోహనకృష్ణ, డి.మునిరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులకు నిత్యావసరాల పంపిణీ



కేసరపల్లి(గన్నవరం): కుష్ఠు వ్యాధిగ్రస్తులు, హెచ్ఐవీ బాధితులను ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో ప్రతిఒక్కరు ముందుకురావాలని గుణదల సోషల్ సర్వీస్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ సునీల్‌రాజు పిలుపునిచ్చారు. కేసరపల్లి శివారు లెప్రసీకాలనీలో మంగళవారం సోషల్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యాన కుష్ఠు వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు, వారి పిల్లలకు స్కూల్ కిట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సోషల్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యాన నాలుగు దశాబ్దాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలోసర్వీస్ సెంటర్ ఫాదర్ మేరుగుమాల వినోద్, సిబ్బంది బాలస్వామి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

70 మందికి వైద్య సేవలు



గన్నవరం రూరల్: ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం ప్రజలకు వరమని ముస్తాబాద పీహెచ్‌సీ వైద్యులు శివప్రసాద్ చెప్పారు. మంగళవారం మాదలవారిగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని 70మంది రోగులకు వైద్య సేవలందించారు. ప్రజారోగ్య రక్షణకు ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందన్నారు. గ్రామాల్లో పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలకు దూరంగా ఉండొచ్చన్నారు. ఏఎన్‌ఎం మేరీ గ్రేస్, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఆరుగొలనులో జరిగిన 'జగనన్న సురక్ష'లో మాట్లాడుతున్న గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. బాపులపాడు మండలం ఆరుగొలనులో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్పంచ్ మూల్పూరి శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వంశీమోహన్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమాల్లో మొక్కుబడి తంతుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారని, వాటిని పరిష్కరించడానికి నాటి ప్రభుత్వం చొరవ చూపించలేదని విమర్శించారు. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లే నేరుగా ఇంటింటికీ వచ్చి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారని, సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. అనంతరం వలంటీర్ల సర్వేల్లో వచ్చిన 1,374 అర్జీలను పరిష్కరించి ప్రజాప్రతినిధులు, అధికారులు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. 520 మందికి కులధ్రువీకరణ పత్రాలు, 571 మంది ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆరుగురికి కొత్త రేషన్‌కార్డులు, 162 మందికి భూరికార్డులకు సంబంధిత పత్రాలు అందించారు. అంతేకాకుండా ప్రత్యేక ఆధార్ శిబిరం నిర్వహించి 115 మంది ఆధార్ కార్డులకు ఫోన్ నంబర్లు లింక్ చేశారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, పీఏసీఎస్ చైర్మన్ మూల్పూరి ప్రభుకాంత్, ఎంపీటీసీ సభ్యులు పురుషోత్తమశర్మ తదితరులు పాల్గొన్నారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు సచివాలయం-2లో మంగళవారం జగనన్న సురక్ష నిర్వహించి లబ్ధిదారులకు 684 వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం 84 కౌలు కార్డులను రైతులకు అందజేశారు. నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు, సచివాలయాల మండల కన్వీనర్ సాదం వెంకటేశ్వరరావు, సచివాలయ ప్రత్యేక అధికారి జాహ్నవి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్, వీఆర్వో అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో..

నున్న(విజయవాడరూరల్): సమాజానికి వలంటీర్ల సేవలు అవసరమని విజయవాడ రూరల్ ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి అన్నారు. మంగళవారం నున్న గ్రామ సచివాలయం 1 వద్ద గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ అధ్యక్షతన జగనన్న సురక్ష శిబిరం జరిగింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ కె.సువర్ణరాజు, నున్న సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్, గన్నవరం ఏఎంసీ చైర్మన్ ఆర్.అంజనకుమారి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్వీఆర్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: పట్టణంలోని 8, 11 వార్డులకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్‌చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మస్తాన్, కౌన్సిలర్లు ఎంప బేగ్, కూరాడ వెంకటలక్ష్మి, డాక్టర్ జంపాన పూర్ణిమ, ప్రభుత్వాసుపత్రి చైర్మన్ జంపాన కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



కోలవెన్నులో ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు

పెనమలూరు: వణుకూరు గ్రామంలో మంగళవారం సచివాలయం 1లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 163 సర్టిఫికెట్లు జారీ చేశారు. వణుకూరు సర్పంచి చక్క విజయజ్ఞానరామలక్ష్మి, ఉపసర్పంచి గద్దల రాజా, ఎంపీడీఓ సునీతాశర్మ, ఏఓ లోయ శివశంకర్, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, పెనమలూరు సొసైటీ అధ్యక్షుడు వేమూరి రాజా, వైఎస్సార్

కంకిపాడు: మంచి మనసున్న నేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు అన్నారు. మండలంలోని కోలవెన్ను గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 970 ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, సర్పంచ్ సీహెచ్ సురేష్‌కుమార్, ఉపసర్పంచ్ కంచర్ల వెంకటరావు, నగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో..

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో పోరంకి సచివాలయం 2, కానూరు సచివాలయం 4లో జగనన్న సురక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కానూరులో 445, పోరంకిలో 371 సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మునిసిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ చాంద్‌బాషా, తహసీల్దార్ వెంకటశివయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కానూరులో సర్టిఫికెట్లు అందజేస్తున్న కమిషనర్ ప్రకాశరావు

నిబంధనల ప్రకారమే విద్యుత్ వినియోగం

విద్యుత్ ఈఈ హరిబాబు

పెనమలూరు: వినియోగదారులు నిబంధనల ప్రకారమే విద్యుత్‌ను వినియోగించాలని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు చెప్పారు. యనమలకుదురు సెక్షన్ పరిధిలో మంగళవారం తాడిగడప, పెదపులిపాక, యనమలకుదురులో విద్యుత్ విజిలెన్స్ అధికారులు 36 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. ఈఈ హరిబాబు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామాజిక నేరమన్నారు. విద్యుత్ చౌర్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ చౌర్యంపై సమాచారం తెలపాలని, చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. విద్యుత్ అధికారులు 3254 సర్వీసులను తనిఖీ చేయగా 97 మంది అధిక లోడ్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వారికి రూ. 3.22 లక్షలు అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఈఈ జి.కమలకుమారి, డెప్యూటీ ఈఈ ఎం.పూర్ణచంద్రరావు, ఏఈ రామ్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



యనమలకుదురులో మాట్లాడుతున్న ఈఈ హరిబాబు

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి

బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు మణికంఠ

పెనమలూరు: వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేస్తామని కృష్ణా జిల్లా బీసీ సంఘ అధ్యక్షుడు వల్లభనేని మణికంఠ అన్నారు. కానూరులో మంగళవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని బీసీ నేతలు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ నియోజకవర్గంలో బీసీలంతా ఏకతాటి పైకి వచ్చి పార్థసారథి గెలుపునకు శ్రమిస్తామన్నారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ జాతీయ అధ్యక్షుడు నాగిడి సాంబశివరావు, మైనార్టీ నేతలు రెహమాన్, సాబు, లతీఫ్, లంకే రాజ్‌కమల్, వల్లభనేని దుర్గాప్రసాద్ పలువురు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పార్థసారథిని సత్కరిస్తున్న బీసీ నేతలు

రైతుబజారులో టమాటాల విక్రయాలు

కంకిపాడు: స్థానిక రైతుబజారులో సబ్సిడీపై టమాటాల విక్రయాలు మంగళవారం చేపట్టారు. బహిరంగ మార్కెట్‌లో టమాటా కిలో రూ.95 వరకు పలుకుతుండటంతో కొనుగోలు దారులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించడానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. కిలో రూ.94కి కొనుగోలు చేసి సబ్సిడీపై రూ.50కే రైతుబజార్లలో టమాటాలను విక్రయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మార్కెటింగ్ శాఖ పర్యవేక్షణలో ఈ నెలలో రెండో పర్యాయం టమాటాలు రైతుబజారుకు చేరాయి. 975 కిలోల టమాటాలను మంగళవారం కొనుగోలుదారులకు విక్రయించారు. విక్రయాలను ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు ప్రారంభించి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి చంద్రమోహన్, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మోర్ల రామచంద్రరావు, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మోర్ల పూర్ణప్రసాద్ పాల్గొన్నారు.



కంకిపాడు రైతుబజారులో సబ్సిడీపై టమాటాల విక్రయాలను ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్

నేడు తరిగొప్పల సచివాలయ భవనం, ఉంగుటూరు పీహెచ్‌సీ ప్రారంభం

ఉంగుటూరు: తరిగొప్పల గ్రామంలో ఈ నెల 12న నిర్వహించనున్న జగనన్న సురక్షలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ హాజరవుతారని ఎంపీడీఓ జీఎస్వీ శేషగిరిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విలేకరులతో మాట్లాడుతూ తరిగొప్పలలో నిర్మించిన సచివాలయ భవనం, ఉంగుటూరులో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని చెప్పారు. సర్పంచులు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు హాజరు కావాలని సూచించారు.

గంజాయి విక్రేతల అరెస్టు

ఉయ్యూరు: గంజాయి విక్రేతలు పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళ్తే. ఉయ్యూరు పట్టణంతోపాటు రూరల్‌లోని ఆకునూరులో ఆరుగురు వ్యక్తులు గంజాయి విక్రయిస్తుండగా ఎస్ఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది ఏకకాలంలో దాడులుచేసి అదుపులోకి తీసుకున్నారు. తాడిగడపకు చెందిన కొల్లూరి పవన్‌తేజ అలియాస్ విక్కీ భూక్యా రాజా నాయక్‌లు ఉయ్యూరులో గంజాయి విక్రయాలు చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ వీరప్రసాద్ సిబ్బందితో ఉయ్యూరు ఆర్టీసీ బస్టాండు సమీపంలో దాడి చేసి 2.5 కిలోలు గంజాయి స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. కాటూరుకు చెందిన షేక్‌వజీద్, యాకమూరికి చెందిన కలగాంటి ఆదర్శ్, ఉయ్యూరుకు చెందిన లంకపల్లి సతీష్, విజయవాడకు చెందిన యర్రంశెట్టి సాయిభార్గవ్ ఆకునూరు గ్రామంలో గంజాయి విక్రయాలకు పాల్పడుతూ పట్టుబడ్డారు. వీరిని ఎస్ఐ వీరప్రసాద్ సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 3.8 కిలోలు గంజాయి, రూ. 1,150 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురినీ అరెస్టు చేసి గన్నవరం కోర్టులో హాజరు పర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించటంతో రాజమండ్రి సెంట్రల్ జైలుకి తరలించినట్లు ఎస్ఐ వీరప్రసాద్ తెలిపారు.

కంకిపాడు: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను కంకిపాడు పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. కొందరు వ్యక్తులు గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసు సిబ్బంది ప్రొద్దుటూరు శివారు గాయత్రీవిహార్‌లోని ఖాళీ స్థలాల్లో దాడులు నిర్వహించారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు గంజాయి బ్యాగులతో వారికి కనిపించారు. వారిద్దరూ పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. పట్టుబడ్డ నిందితులు ఉప్పలూరు గ్రామానికి చెందిన చిన్నం వెంకట నాగరాజు, గన్నవరం మండలం కొత్తపేటకు చెందిన గండికోట శామ్యూల్‌రాజు గా గుర్తించారు. వీరి నుంచి 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు హాజరుపరిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని అదనపు ఎస్ఐ జె.లక్ష్మి తెలిపారు.

ముగ్గురు అరెస్ట్

ఉంగుటూరు: స్థానిక డంపింగ్‌యార్డ్ వద్ద గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను ఉంగుటూరు ఎస్ఐ జి.రాజు మంగళవారం అరెస్ట్ చేశారు. ఉంగుటూరు డంపింగ్ యార్డు వద్ద ముగ్గురు యువకులు గంజాయి సేవిస్తున్నారనే సమాచారం అందడంతో ఎస్ఐ తన సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని 3.4 కేజీల గంజాయిని స్వాధీన పరచుకున్నారు. పీఎస్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గన్నవరం మండలం మర్లపాలెంకు చెందిన గరిసెపల్లి మారుతాత్మజ్, గరిసెపల్లి శ్రీరామ్, రామ్‌నరక్‌కు చెందిన దినేష్ గంజాయికి అలవాటుపడ్డారని తెలుసుకున్నారు.

పవన్ వ్యాఖ్యలపై వలంటీర్ల ఆగ్రహం

- క్షమాపణ చెప్పాలి
- కంకిపాడు సెంటరులో ధర్నా, మానవహారం

కంకిపాడు: తమ మనోభావాలను దెబ్బతీసేలా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కంకిపాడులో వలంటీర్లు పవన్ వ్యాఖ్యలను నిరసిస్తూ గన్నవరం రోడ్డు కూడలిలో మానవహారంగా ఏర్పడి ధర్నా చేశారు. డౌన్ డౌన్ పవన్ కల్యాణ్...బహిరంగ క్షమాపణ చెప్పాలి..అని వలంటీర్లు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో వలంటీర్లు అందించిన సేవలు అభినందనీయమని, నిస్వార్థ సేవను విమర్శించడం సిగ్గుచేటని పలువురు పేర్కొన్నారు. వలంటీర్లు మానవహారంగా ఏర్పడ్డ సమయంలో అటుగా వెళ్తున్న జనసేన నేత పులి కామేశ్వరరావు వారితో వాగ్వాదానికి దిగారు. అయినా వలంటీర్లు జనసేన అధ్యక్షుడు పవన్ వ్యాఖ్యలను విమర్శిస్తూ, డౌన్ డౌన్ కల్యాణ్ అంటూ నినాదాలు చేశారు. దీంతో అక్కడ పోలీసులు, స్థానికులు స్పందించి జనసేన నేతను పక్కకు తీసుకెళ్లడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.



కంకిపాడులో మానవహారంగా నిరసన తెలుపుతున్న వలంటీర్లు

హనుమాన్‌జంక్షన్ రూరల్: పవన్‌కల్యాణ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తే వలంటీర్లు మంగళవారం హనుమాన్‌జంక్షన్‌లో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. బాపులపాడు, అప్పనవీడు, ఏపూరు గ్రామాలకు చెందిన వలంటీర్లు అధిక సంఖ్యలో మంగళవారం స్థానిక రహదారుల్లో నిరసన ప్రదర్శన చేశారు. పవన్‌కల్యాణ్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. జంక్షన్ సెంటర్‌లో జాతీయ రహదారిపై వలంటీర్లు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. కోవిడ్ తరుణంలో వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిల్చిందని, వారిపై అర్థరహిత విమర్శలు చేయటం తగదని హితవు పలికారు.

అధిక జనాభా.. ప్రగతికి అవరోధం

ఉయ్యూరు: అధిక జనాభా.. ప్రగతికి అవరోధమని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉయ్యూరులో ర్యాలీ నిర్వహించారు. చైర్మన్ నాని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జనాభా నియంత్రణ పాటించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మస్తాన్, వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కౌన్సిలర్లు వెంకటలక్ష్మి, డాక్టర్ జంపాన పూర్ణిమ, డాక్టర్ తేజస్విని పాల్గొన్నారు. కాటూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి దీప పాల్గొన్నారు. ముదునూరు, బోళ్లపాడు, కలవపాముల, కడవకొల్లు గ్రామాల్లో ర్యాలీలు జరిగాయి. డాక్టర్ శాంతి శివరామకృష్ణ పర్యవేక్షించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: దేశ శ్రేయస్సు, ఆనందమయ జీవనం కోసం కుటుంబ నియంత్రణ పాటించాలని బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూష తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాత్మాగాంధీనగర్‌లో మంగళవారం వైద్య, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ ఎస్.ఫణికుమార్, హెచ్ఎస్ అప్పారావు, హెల్త్ అసిస్టెంట్ జి.నాగరాజు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ఉయ్యూరులో జరిగిన ర్యాలీలో చైర్మన్ వల్లభనేని నాని, కమిషనర్ వెంకటేశ్వరరావు

వలంటీర్ల సేవలు అభినందనీయం

రామవరప్పాడు: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా నిలుస్తూ వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని రూరల్ మండల ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో మంగళవారం వలంటీర్లకు సేవారత్న పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమారి మాట్లాడుతూ అర్హులైన ప్రతి గడపకు సంక్షేమ పథకాలు తీసుకెళ్లడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను నెరవేరుస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు వస్తున్నారని అభినందించారు. మరింత అంకితభావంతో పని చేసి ప్రతి ఒక్కరికి సంక్షేమం అందేలా చూడాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు. అనంతరం జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ సమ్మెట సాంబశివరావు వలంటీర్ల పాదాలకు పాలాభిషేకం చేసి వారి ప్రాధాన్యతను చాటి చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సువర్ణరాజు, సర్పంచ్ వరి శ్రీదేవి, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



వలంటీర్ల పాదాలకు పాలాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ సాంబశివరావు

రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ పీవీపీకి ఐదు అవార్డులు

పెనమలూరు: రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ పీవీపీ సిద్ధార్థకు ఐదు అవార్డులు వచ్చాయని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు అన్నారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ విజయవాడ శ్రీపొట్టి శ్రీరాములు చదలవాడ మల్లికార్జునరావు కాలేజీలో ఈ నెల 8వ తేదీన ప్రతిష్టాత్మకమైన రోటరాక్ట్ కార్యక్రమంలో తమ కాలేజీకి ఐదు అవార్డులు వచ్చాయన్నారు. యువజన సేవా సంచాలకులుగా సుజనాచౌదరి, వృత్తి సేవలు అందించిన కంచర్ల రమ్య, ఉత్తమ మహిళా రోటరాక్ట్‌గా కావ్య, ఉత్తమ డిజైనర్‌గా సౌమ్య, సేవా రంగంలో ఎక్సలెన్స్ అవార్డు పీవీపీ సిద్ధార్థ రోటరాక్ట్‌కు అవార్డులు వచ్చాయన్నారు.ఈ సందర్భంగా అవార్డులు గెలుచుకున్న వారిని అభినందించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.శ్యామ్ పాల్గొన్నారు.



అవార్డులు పొందిన విద్యార్థులు